ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

A.C.O - 9003200801

S.R - 9551168092

27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

రూ.92,075 కోట్ల లోటుతో బడ్జెట్

- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన విత్తమంత్రి
- రాబడి: రూ.2,73,246 కోట్లు ● ఖర్చు: రూ.3,65,321 కోట్లు
- 3 లక్షల మంది కాలేజీ విద్యార్థులకు ప్రతినెలా రూ.1000
- రాష్ట్రంలో 8 లక్షల కాంక్రీటు ఇళ్లు
- పేదరిక నిర్మూలనకు 'తాయు మానవర్' పథకం
- ఊటీ, కొడైక్కెనాల్ మహిళలకు సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- పూందమల్లిలో రూ.500 కోట్లతో ఫిల్మ్‌సిటీ



సీఎం స్టాలిన్ వెంట బడ్జెట్ ప్రతిపాదనలతో శాసనసభకు వెళుతున్న ఆర్థిక మంత్రి

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు సోమవారం ఉదయం శాసనసభలో 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రాబడి రూ.2,73,246 కోట్లుగా, వ్యయాన్ని రూ.3,65,321 కోట్లుగా చూపెడుతూ రూ.92,075 కోట్ల లోటు బడ్జెట్‌ను దాఖలు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ రుణభారం రూ.8 లక్షల కోట్లకు పెరిగినట్లు పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ బడ్జెట్‌లో కొత్త ప్రజాకర్షణ పథకాలు ఉంటాయని అందరూ భావించిన నేపథ్యంలో ఎనిమిది జిల్లాల్లో తుఫాను, వరదల కారణంగా ఏర్పడిన అదనపు వ్యయభారంతో కుంగిన ఆర్థికపరిస్థితిని మెరుగుపరచాల్సిన అవసరం ఏర్పడిందంటూ దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగించే పథకాల ప్రకటనలను గుప్పించారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు జార్జికోటలో ఉన్న సీఎం కార్యాలయానికి వెళ్లిన విత్తమంత్రి.. ఆయన ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి వెంట అసెంబ్లీకి చేరుకున్న మంత్రి తంగం తెన్నరసు.. స్పీకర్ అనుమతి మేరకు ఉదయం 10 గంటలకు బడ్జెట్ దాఖలు చేశారు.

పేదరిక నిర్మూలన...

రాష్ట్రంలో 5లక్షల కుటుంబాలను ఎంపిక చేసి వారికి ఆర్థిక స్థోమత కల్పించే దిశగా 'తాయుమానవర్' పథకం అమలు చేయనున్నట్లు మంత్రి తంగం తెన్నరసు పేర్కొన్నారు. ఇప్పటి వరకు విద్యార్థినులకే పరిమితమైన 'పుదుమైపెణ్' పథకాన్ని విద్యార్థులకూ విస్తరించారు. ఈ పథకానికి 'తమిళ్ పుదల్వన్' అనే పేరుపెట్టారు. సుమారు 3 లక్షల మంది కాలేజీ విద్యార్థులకు ప్రయోజనం కలిగించే ఈ పథకానికి రూ.360 కోట్లు కేటాయించడమే కాకుండా ఇకపై ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థినులకు వర్తింపజేస్తామని చెప్పారు. 'వెలుగుబాట పయనం' పేరుతో సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ఊటీ, కొడైకెనాల్ వంటి కొండ ప్రాంతాల్లో నివసించే మహిళలకు విస్తరిస్తామని ప్రకటించారు.

8 లక్షల కాంక్రీటు గృహాలు

రాష్ట్రాన్ని గుడిసె రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు కలైంజర్ డ్రీమ్ హౌస్ పథకం ద్వారా 2030లోగా 8 లక్షల కాంక్రీట్ ఇళ్లను నిర్మించనున్నామి ఇందుకు రూ.3500 కోట్లను కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా రూ.3.5 లక్షలతో ఒక్కో కాంక్రీటు ఇంటిని నిర్మిస్తామన్నారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమకు ఊతమిచ్చే రీతిలో పూందమల్లిలో అన్ని సదుపాయాలతో రూ.500 కోట్లతో ఫిల్మ్‌సిటీని నిర్మించనున్నట్లు తెలిపారు. ఇదే విధంగా బడ్జెట్‌లో ఉన్నత విద్యాశాఖకు రూ.8,212 కోట్లు, పాఠశాలల విద్యాశాఖకు రూ.4442 కోట్లు, ఆరోగ్యశాఖకు 20,198 కోట్లు, యువజన సంక్షేమం, క్రీడాశాఖలకు రూ.440కోట్లు, పరిశ్రమల శాఖకు రూ.2,295కోట్లు చొప్పున నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.

నిధులివ్వని కేంద్రం...

తుఫాను, వరదలకు రాష్ట్రం తీవ్రంగా నష్టపోయినా, రెండో దశ మెట్రోరైలు పథకానికి అధికారిక అనుమతి మంజూరు చేయకపోవడంతో అవసరమైన మొత్తం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి వస్తోందన్నారు. దీనితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.9వేల కోట్ల మేరకు ప్రభుత్వంపై వ్యయభారం పడుతుందన్నారు. మీనంబాక్కం విమానాశ్రయం నుండి కిలాంబాక్కం, కోయంబేడు - ఆవడి మార్గాలలో మెట్రోరైలు సేవల విస్తరణకు రూ.12వేల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గత జూన్ ఆరు నుంచి జీఎస్టీ బకాయిలు నిలిపివేయడంతో ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయని చెప్పారు.

ఉత్తర చెన్నై అభివృద్ధికి రూ.1000 కోట్లు...

ఈ బడ్జెట్‌లో ఉత్తర చెన్నై అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించినట్లు మంత్రి తంగం తెన్నరసు తెలిపారు. బేసిన్ బ్రిడ్జి రోడ్డులో రూ.75 కోట్లతో భూగర్భడ్రైనేజీ పథకాన్ని, ఎగ్మూరు చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో రూ.53 కోట్లతో అంతర్జాతీయ వైద్య సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ప్రైవేటు భాగస్వామ్యంతో చెన్నై పరిసర ప్రాంతాల్లోని నదుల ప్రక్షాళన కోసం రూ.1500కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ముట్టుకాడు వద్ద కలైంజర్ ఇంటర్నేషనల్ హాలు ను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

నియో టైడల్ పార్కులు...

తంజావూరు సేలం, వేలూరు, తిరుప్పూరు, తూత్తుకుడిలో 13వేల మందికి ఉపాధికల్పించేలా నియో టైడల్ పార్కులు నిర్మించనున్నామని, వాణిజ్య నగరం కోయంబత్తూరులో రూ.1100 కోట్లతో ఐటీ పార్కును ఏర్పాటు చేస్తామని, చెన్నై, కోవై, మదురై, తిరుచ్చి, సేలం జిల్లాల్లో 1000 చోట్ల ఉచిత వైఫై సేవలు అందించనున్నామని ఆయన వివరించారు. ఇదే విధంగా మదురైలో రూ.345 కోట్లతో, తిరుచ్చిలో రూ.350 కోట్లతో టైడల్ పార్కులు నిర్మిస్తామన్నారు. తంజావూరు జిల్లాలో సిప్కాట్ పారిశ్రామిక వాడ, విరుదునగర్, సేలంలో రూ.2483 కోట్లతో జౌళి పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు.

బడ్జెట్ కీలక అంశాలు....

- చెన్నై, మదురై, కోవైల్లో రైల్వేస్, బ్యాంక్ పోటీ పరీక్షలకోసం శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు రూ.6కోట్లు
- కోవైలో కలైంజర్ పేరుతో అతిపెద్ద గ్రంథాలయం
- తిరుప్పరంకుండ్రం, తిరునీర్‌మలై ఆలయాలకు రోప్‌కార్లు
- శిలప్పదికారం, మణిమేఖలై వంటి ప్రాచీన తమిళ సాహిత్యాల అనువాదానికి రూ.2 కోట్లు
- 5 వేల చెరువుల మరమ్మతుల కోసం రూ.500 కోట్లు
- అడయార్ వాగు మరమ్మతులకు రూ.1,500 కోట్లు.
- మెరీనా, కడలూరు సిల్వర్‌బీచ్ సహా ఎనిమిది బీచ్‌ల అభివృద్ధి
- హొగెనేకల్ రెండో దశ సమగ్ర నీటిపథకానికి రూ.7,890 కోట్లు
- చెన్నై, తిరుచ్చి, మదురై, నీలగిరిలో ఒలంపిక్ శిక్షణ కేంద్రాలు
- కీలడి వద్ద రూ.17 కోట్లతో ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం
- కులశేఖరపట్టినంలో స్పేస్ పార్కు
- తూత్తుకుడిలో అంతరిక్ష పరిశోధన పరికరాల తయారీ పార్కు
- చెన్నై, కోవై, మదురై తదితర నగరాలలో రూ.26 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు
- రూ.300 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 15 వేల స్మార్ట్ క్లాస్‌లు
- రవాణా శాఖలో కొత్తగా 3 వేల కొత్త బస్సులు, 500 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు
- మరపడవ జాలర్లకు సబ్సిడీపై ఇచ్చే డీజిల్‌ను 18 వేల లీటర్ల నుంచి 19 వేల లీటర్లకు పెంపు. మోటారు పడవలు నడిపే జాలర్లకు డీజిల్‌ను 4 వేల లీటర్ల నుండి 4500 లీటర్లకు పెంపు
- అగ్నిమాపక శాఖకు రూ. 373 కోట్లు

2 గంటలపాటు...

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు శాసనసభలో ఉదయం 10 గంటలకు ఆర్థిక బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టారు. ఆ సందర్భంగా ఆయన 164 పేజీల బడ్జెట్‌ను 2 గంటల 7 నిమిషాల్లో చదివారు. ఆర్థిక మంత్రి పదవిని చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన ఈ బడ్జెట్ ప్రసంగం చేశారు. ఇదిలా ఉండగా బడ్జెట్ ఆంగ్లంలో 108 పేజీలున్నాయి.



శాసనసభలో బడ్జెట్ ప్రతిపాదనలు వివరిస్తున్న ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు

రూపాయి రాక..

ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ప్రతిపాదించిన ఆర్థిక బడ్జెట్ అంశాల ప్రకారం రాష్ట్రానికి ఆదాయంగా వచ్చే ప్రతి రూపాయి ఏవిధంగా వ్యయమవుతుందన్న వివరాలను ఆర్థిక శాఖ కార్యదర్శి ఉదయచంద్రన్ తెలిపారు. పన్నుల రూపంలో రూ.43.4 శాతం, రుణాల ద్వారా 32.4 శాతం, కేంద్ర పన్నుల వాటా ద్వారా 11.1 శాతం, రాష్ట్రానికి సంబంధించి ఇతర వనరుల ద్వారా 6.8 శాతం, కేంద్ర ప్రభుత్వం నుండి పొందే సహాయాలు, సబ్సిడీల ద్వారా 5.2 శాతం, రుణాల వసూళ్లు, మూలధన రాబడిగా 11. శాతం చొప్పున రాబడి అందుతున్నట్లు ఈ బడ్జెట్‌లో చూపారు.

రూపాయి పోక...

ఆర్థిక సహాయాలు, సబ్సిడీల కోసం 32.4 శాతం, వేతనాల కోసం 18,7 శాతం, వడ్డీ చెల్లింపులకు 14.1 శాతం, మూలధన వ్యయంగా 10.5 శాతం, రుణాల చెల్లింపుల కోసం 9.1 శాతం, ఫించన్, ఫించన్ బకాయిల చెల్లింపులకు 8.3 శాతం, రుణాల మంజూరుకు 3.6 శాతం, నిర్వహణ ఖర్చులకు 3.3 శాతం చొప్పున వ్యయమవుతోందని ఈ బడ్జెట్‌లో చూపెట్టారు.

అప్పులే తప్ప... అభివృద్ధి ఏదీ?

● మండిపడిన ప్రతిపక్షం

పెరంబూరు, ఫిబ్రవరి 19: ఆర్థికమంత్రి తంగం తెన్నరసు సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రతిపక్ష నేతలు పెదవి విరిచారు. అప్పులు, అబద్ధాలు తప్ప అభివృద్ధి కనిపించలేదంటూ ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలోకి తీసుకెళ్తున్నామంటూ డీఎంకే పాలకులు ఇన్నాళ్లూ చేసిన ప్రచారమంతా ఉత్తిదేనని ఈ బడ్జెట్‌తో తేలిపోయిందని అన్నాడీఎంకే, బీజేపీ, అమ్మామక్కల్ కట్చి వంటి పార్టీల నేతలు పేర్కొన్నారు. అయితే అధికార డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, వామపక్షాలు, డీపీఐ నేతలు మాత్రం ఈ బడ్జెట్ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తుందని ప్రశంసించారు.

అసెంబ్లీ వెలుపల ఆయా నేతలు చేసిన వ్యాఖ్యలు వారి మాటల్లోనే...

పెరిగిన అప్పులు

● ప్రతిపక్ష నేత పళనిస్వామి



అసెంబ్లీ వెలుపల అన్నాడీఎంకే నేత ఈపీఎస్

డీఎంకే అధికారం చేపట్టిన తర్వాత, సుమారు రూ. 8,33,361 కోట్ల అప్పులు పెరిగాయి. అప్పుల సమస్య పరిష్కరించేందుకు కమిటీని నియమించారు. ప్రస్తుతం ఆ కమిటీ ఆచూకీ కనుగొనేందుకు మరో కమిటీ వేయాల్సి ఉంది. ఈ బడ్జెట్‌లో పద జాలం ఉంది... ప్రజలకు పథకాలు లేవు. సీఎంగా జయలలిత హయాంలో పేదల కోసం హరిత గృహాల పథకం అమలుచేయగా, ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం దాన్ని నిలిపివేసింది. గ్రామీణ ప్రాంతాల్లో 1.52 లక్షల కి.మీ రోడ్ల పునరుద్ధరణకు కేవలం రూ.1,000 కోట్లు మాత్రమే కేటాయించారు. డీఎంకే మేనిఫెస్టోలో బ్యారేజీలు నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయిస్తామని చెప్పారు. కానీ, దాని ప్రస్తావనే లేదు. డీఎంకే అధికారం చేపట్టిన తర్వాత, 2021-22లో 72,839.29 కోట్ల లోటు, 2022-23లో 1,55,625.11 కోట్ల లోటు, 2023-24లో రూ.2,49,684 కోట్లు, 2024-25 ప్రణాళిక అంచనాలో రూ.3,58,384 కోట్లు లోటుగా చెబుతున్నారు. అలాగే, ఈ ఏడాది ఆర్థిక లోటు రూ.1,08,659 కోట్లుగా ఉందని బడ్జెట్‌లో పేర్కొన్నారు.

మరోసారి మోసం...

● బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్



మరోసారి రాష్ట్రప్రజలను డీఎంకే మోసం చేసింది. గత మూడు బడ్జెట్లలో ఉన్న అంశాలే ప్రస్తుతం ఉన్నాయి. జలాశయాల పునరుద్ధరణ, కొత్త బస్సుల కొనుగోలు తదితరాలు ప్రతి వార్షిక బడ్జెట్‌లో పేర్కొంటున్నా, నేటి వరకు అవి అమలుకు నోచుకోలేదు. కేంద్రప్రభుత్వ పథకాలను తమ పథకాలుగా చెప్పుకుంటూ డీఎంకే ప్రభుత్వం పబ్బం గడుపుకుంటోంది. దివంగత డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి పేరు అన్నిటా వినియోగించాలనే ఆతృత కన్పిస్తోంది.

లేని శరీరానికి ఆభరణం...

● పీఎంకే అధినేత డాక్టర్ రాందాస్

తమిళనాడు ఆర్థిక నివేదికలో పొందుపరచాల్సిన ప్రాజెక్టులు లేకపోగా, లేని శరీరానికి ఆభరణాలు వేసినట్టుగా ఉందీ బడ్జెట్. ఎవరికీ ఉపయోగం లేని కరువు బడ్జెట్. విద్య, ఉపాధి, నీటిపారుదల, మౌలిక సదుపాయాల మెరుగుకు ప్రణాళికలు లేవు. కులగణనపై ప్రకటన లేదు. 2024-25లో రూ.1,55,584 కోట్ల రుణాలు తీసుకొనే స్థాయికి రాష్ట్ర పరిస్థితి దిగజారినా, ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు ఎలాంటి కొత్త చర్యలు చేపట్టలేదు.

ఎన్నికల బడ్జెట్: టీటీవీ దినకరన్

గత సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇంకా నెరవేర్చని నేపథ్యంలో, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఈ బడ్జెట్ ద్వారా మరో నాటకాన్ని డీఎంకే ప్రభుత్వం తెరతీసింది. అమ్మ క్యాంటీన్లు, ల్యాప్‌టాప్‌ల పంపిణీ తదితరాలకు ఈ బడ్జెట్‌లో స్థానం కల్పించలేదు. రాబోయే రెండేళ్లలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు నియమిస్తామని ప్రకటించింది. కానీ, 3.50 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలోని 187వ హామీపై మాత్రం బడ్జెట్‌లో నోరు మెదపలేదు.

ఆహ్వానించదగిన బడ్జెట్

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై

కాలానికి అనుగుణంగా రూపొందించిన బడ్జెట్‌ను ఆహ్వానిస్తున్నాం. ఇంతకన్నా మంచి బడ్జెట్ ఎవరూ అందించలేరు. తమిళనాడును కేంద్ర ప్రభుత్వం వంచిస్తోంది. రాష్ట్ర ప్రజల నుంచి వసూలు చేసిన పన్ను ఉత్తరప్రదేశ్, బీజేపీ పాలిత రాష్ట్రాలకు తరలిస్తోంది. జీఎస్టీ పన్ను వాటాను రాష్ట్రానికి అందించకుండా కేంద్రం నిర్లక్ష్యం చూపుతోంది.

సమతౌల్య అభివృద్ధి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్

సామాజిక న్యాయ దృక్పథంతో కూడిన ఆర్థిక స్థితి నివేదిక అనేక అడ్డంకులను అధిగమించి సమతౌల్య అభివృద్ధి సాధించేలా ఉంది. 50 వేల ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటన స్వాగతిస్తున్నాం. తమిళ సాహిత్యాన్ని ఇతర భాషల్లోకి అనువదించడం, గిరిజన భాషల డ్యాక్యుమెంట్ ప్రాజెక్ట్, కావేరి, వైగై, నోయల్, తామ్రభరణి నదులతో పాటు 5 వేల చెరువుల పునరుద్ధరణ, 2 వేల ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం తదితరాలను ఆహ్వానిస్తున్నాం.

అడ్డంకులు అధిగమించి..

● ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో

అడ్డంకులు అధిగమించి, అభివృద్ధి దిశగా 2024-25 వార్షిక బడ్జెట్ ఉంది. రాష్ట్ర సమతౌల్య అభివృద్ధి కోసం 'అందరికీ అన్నీ' అనే ద్రావిడ మోడల్ ప్రాథమిక సిద్ధాంత విజయానికి బడ్జెట్ పునాది వేసింది.

అభివృద్ధికి పెద్ద పీట

● డీపీఐ అధ్యక్షుడు తిరుమా

విద్య, ఉపాధి రంగాల మెరుగునకు అందించిన రాయితీలు, ప్రకటించిన సంక్షేమ పథకాలు అభినందనీయం. గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే బడ్జెట్ స్వరూపాన్ని స్వాగతిస్తున్నాం. పారిశ్రామికాభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన, మహిళల ఆర్థికాభివృద్ధి, ఉన్నత విద్యలో మహిళలు రాణించే చర్యలు, దివ్యాంగులకు సంక్షేమ పథకాలు తదితరాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యతనివ్వడం ఆహ్వానించదగ్గ పరిమాణం.

కొత్త వెలుగులు నింపిన బడ్జెట్

● ద్రావిడ కళగం నేత వీరమణి

ఆర్థిక లోటు ఉన్నా కొత్త ప్రాజెక్టులు, పలు రంగాలకు నిధులు పెంపు తదితరాలతో కొత్త వెలుగులు నింపే బడ్జెట్. సామాజిక న్యాయం, విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపరడచం, కార్పొరేషన్‌లలో మౌలిక వసతులు, పారిశ్రామికంగా అన్ని జిల్లాల అభివృద్ధి తదితరాలను స్వాగతిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా, అభివృద్ధి పథకాల అమలుకు ప్రాధాన్యం ఇచ్చేలా నిధులు కేటాయించడం భేష్.

సమైక్యతను పెంచేది సాహిత్యమే

● ఏపీ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

ప్యారీస్, ఫిబ్రవరి 19: దేశంలో అన్నివర్గాల మధ్య సమైక్యతను పెంచేది సాహిత్యమేనని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి పూర్వ సభ్యుడు విఠపు బాలసుబ్రహ్మణం పేర్కొన్నారు. ట్రిప్లికేన్ నియోజకవర్గంలో ఉన్న రాజధాని కళాశాల తెలుగుశాఖ, చెన్నపురి తెలుగు అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు కళాశాల ప్రాంగణంలోని పావెల్ హాల్ వేదికగా భాషా సదస్సు ఘనంగా నిర్వహించారు. చిన్నయసూరి 216వ జయంతి సందర్భంగా 2023 డిసెంబరు 20న ఆవిష్కరించిన పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ సభలో సాహిత్య అకాడమీ ప్రచురణల విభాగం సహాయకుడు డాక్టర్ శ్రీనివాస్ చింతలపూడి రచించిన తెలుగు సాహిత్యసేవల్లో 'తెలుగు సాహిత్య అకాడమీ' గ్రంథాన్ని సమీక్షించారు. రాజధాని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రామన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా విఠపు బాలసుబ్రహ్మణ్యం హాజరై ప్రసంగించారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 1954వ సంవత్సరం సాహితీవేత్తలను, రచయితలను, కవులను ప్రోత్సహించాలన్న దృక్పథంతో సాహిత్య అకాడమీకి శ్రీకారం చుట్టారని, సాహిత్యకారుల కృషి వల్ల దేశం రోజురోజుకు సమైక్యతాభావంతో ముందుకెళుతోందన్నారు. రాజధాని కళాశాలతో తెలుగు భాష ను పోషించిన పరవస్తు చిన్నయసూరి మిత్రభేదం, మిత్రలాభం, బాల వ్యాకరణాన్ని రచించి సాహితీ లోకానికి కానుకగా అందజేశారని కొనియాడారు. తెలుగు సాహిత్యసేవలో సాహిత్య అకాడమీపై చింతలపూడి శ్రీనివాస్ రాసిన పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథం సమగ్రంగా ఉందని సూచించారు. అనంతరం విశిష్ట అతిథి చెన్నై ఆదాయ పన్ను శాఖ అడిషినల్ కమిషనర్ ఎం.సమత మాట్లాడుతూ... తెలుగు పద్యాలకు నన్నయ్య, గద్యాలకు చిన్నయ్య అనే నానుడి ఇప్పటికీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వినిపిస్తోందని అన్నారు. సమాజాన్ని మంచి దారిలో నడిపించాలన్న దృష్టితో చిన్నయసూరి 200 సంవత్సరాల క్రితమే మిత్రలాభం, మిత్రబేధంతో పాటు బాల వ్యాకరణాన్ని రచించి తెలుగు భాషకు తన వంతు సేవ చేశారన్నారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి, పరవస్తు చిన్నయసూరి ఐదో తరానికి చెందిన పరవస్తు నాగసాయి సూరి మాట్లాడుతూ... తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యం, చరిత్రను దృష్టిలో ఉంచుకొని తమ వంశోద్ధారకుడు చిన్నయసూరి అందించిన రచనలను తెలుగు సంస్థలు విశ్వవ్యాప్తం చేయాలని అభిప్రాయపడ్డారు. క్రైస్తవుల మధ్య గొప్ప 'సేవలందించినందువల్లే బ్రిటీష్ పాలకులు ఆయనకు 'సూరి' అనే అవార్డు అందజేసి సత్కరించారన్నారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ చీరాలకు చెందిన విశ్రాంత ఉపన్యాసకులు డాక్టర్ బీరం సుందరరావు గ్రంథ సమీక్ష చేస్తూ.. సమాజాన్ని చైతన్యవంతం చేసే విధంగా చిన్నయసూరి, గురజాడ అప్పారావు రచనలు ఉన్నాయని, పరిశోధన గ్రంథాల్లో వాస్తవాలు మాత్రమే ఉండాలని సూచించారు. 1954 నుంచి 1962 వరకు బెజవాడ గోపాలరెడ్డి, శివశంకర స్వామి, రాయప్రోలు సుబ్బారావు తదితర మహామహులు తెలుగు సాహిత్య అకాడమీకి బలమైన పునాదులు వేశారన్నారు. అవార్డులు తిరస్కరించడం మూర్ఖత్వమన్నారు. రాజధాని కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎలిజబెత్ జయకుమారి, చెన్నపురి తెలుగు అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ తూమాటి సంజీవరావు ఏర్పాట్లు పర్యవేక్షించిన ఈ సభలో డాక్టర్ కాసల నాగభూషణం, భాస్కర్, విద్యార్థులు కూడా పాల్గొన్నారు.



పరవస్తు చిన్నయసూరి 216వ జయంతి సభ పుస్తకాన్ని పరిచయం చేస్తున్న దృశ్యం

సమాచార దర్శిని

రేపు సాహిత్య అకాడమీలో మాతృభాషా దినోత్సవం

వేళచ్చేరి, ఫిబ్రవరి 19: స్థానిక తేనాంపేటలో వున్న సాహిత్య అకాడమీలో బుధవారం సాయంత్రం 6 గంటలకు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరగనుంది. సాహిత్య అకాడమీ తమిళ్ అడ్వైజరీ బోర్డ్ సభ్యుడు వై.మణికంఠన్ అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమంలో ఎం.రంగస్వామి (కన్నడ), వత్సల కిరణ్ (మలయాళం), డాక్టర్ కాసల నాగభూషణం (తెలుగు) తదితరులు కూడా పాల్గొననున్నారు.

మూడు పరీక్షా ఫలితాల విడుదల

ఐసిఎఫ్, ఫిబ్రవరి 19: వ్యవసాయ సహాయ డైరెక్టర్ సహా మూడు రకాల పోస్టులకు నిర్వహించిన పరీక్షా ఫలితాలు టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. గత ఏడాది మేలో వ్యవసాయ సహాయ డైరెక్టర్, ఉద్యానవన అధికారి, పరిశోధన సహాయకులు వంటి పోస్టుల భర్తీకి రాతపరీక్షలు జరిగాయి. ఈ ఫలితాలను టీఎన్‌పీఎస్సీ ఆదివారం విడుదల చేసింది. ఇతర వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్లో చూడొచ్చు.

47,451 శునకాలకు శస్త్రచికిత్స

ఐసిఎఫ్, ఫిబ్రవరి 19: మూడేళ్లలో 47,451 శునకాలకు జాతి నియంత్రణ శస్త్రచికిత్స చేసినట్లు చెన్నై కార్పొరేషన్ తెలిపింది. వీధి కుక్కల సంఖ్య నియంత్రించేలా చర్యలు చేపట్టిన కార్పొరేషన్ వాటికి శస్త్రచికిత్సలు చేసి వదిలి పెడుతోంది. నగరంలో 16 లక్షలకు పైగా వీధి శునకాలుండగా, 2021లో 14,233 శునకాలు, 2022లో 16,591, 2023లో 14,696, జనవరిలో 1,207, ఈ నెల 15వ తేది వరకు 724 మొత్తం మూడేళ్లలో 47,451 శునకాలకు జాతి నియంత్రణ శస్త్రచికిత్సలు చేసినట్లు అధికారులు తెలిపారు.

మహాబలిపురం సందర్శన

ఐసిఎఫ్, ఫిబ్రవరి 19: విద్యా పర్యటనగా మహాబలిపురాన్ని గత జనవరిలో 20,000 మంది పాఠశాల విద్యార్థులు సందర్శించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు పర్యాటక స్థలాల్లో మొదటి స్థానం పొందిన తాజ్‌మహల్‌ను గత ఏడాది వెనక్కునెట్టి మహాబలిపురం ముందంజలో ఉంది. 2019లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భేటీ, 2022లో అంతర్జాతీయ 44వ చెస్ పోటీలు, గాలిపటాల ఉత్సవాలు, గత ఏడాది 5 వేల పాఠశాల విద్యార్థులు తయారుచేసిన ఉపగ్రహ సౌండింగ్ రాకెట్ ప్రయోగం వంటివి ప్రపంచదేశాలను ఆకర్షించాయి. దీంతో విద్యార్థుల విహారయాత్రలో ప్రధాన స్థానంగా మహాబలిపురం ఉండడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.

5న తపాలా బీమా ఏజెంట్లకు ఇంటర్వ్యూలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 19: తపాలా బీమా ఏజెంట్ పోస్టులకు మార్చి 5వ తేదీ తాంబరంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. తపాలా శాఖ తాంబరం డివిజన్‌లో బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా ఏజెంట్ల నియామకాలు జరగనున్నాయి. ఆసక్తి కలిగిన వారు మార్చి 5వ తేది ఉదయం 11 గంటలకు తాంబరం డివిజన్ తపాలా సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో పాటూ నకళ్లతో హాజరుకావాలి. ఎంపికైన వారు రూ.5 వేల డిపాజిట్, తాత్కాలిక లైసెన్స్ రుసుము రూ.50 చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

ఉత్తమ కళాకారులకు పురస్కారం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 19: చెన్నై జిల్లాస్థాయిలో ఉత్తమ కళాకారులకు పురస్కారం అందించనున్నట్టు చెన్నై జిల్లా కలెక్టర్ తెలిపారు. 18 ఏళ్ల పైబడిన వారికి 'కలై ఇళమణి', 19-30 ఏళ్లున్నవారికి 'కలై సుదర్మణి', 36-50 ఏళ్లున్నవారికి 'నన్మణి', 66 ఏళ్ల పైబడిన వారికి 'కలై ముదుమణి' పురస్కారాలు అందిస్తారు. చెన్నైకి చెందిన గాత్ర సంగీతం, భరత నాట్యం, నాదస్వరం, డోలు, వయొలిన్ వంటి వాయిద్య కళాకారులు, నాటకం, కావడి, పాయ్‌కాల్‌గుదిరై నాట్యం, తెరుకూత్తు వంటి జానపద కళాకారులు ఈ నెల 29వ తేది నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు నెం.044-27269148లో సంప్రదించవచ్చు.

నేడు, రేపు పళని రోప్‌కార్ సేవలు రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 19: మరమ్మతుల కారణంగా పళని రోప్‌కార్ సేవలు మంగళ, బుధవారాల్లో రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. పళని దండాయుధపాణి కొండ ఆలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం రోప్‌కార్, వించ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. భక్తుల భద్రత, రోప్‌కార్ పర్యవేక్షణ తదితరాల కోసం ప్రతి నెలా నిర్వహణ పరమైన మరమ్మతులు చేపడుతుంటారు. అందువల్ల రెండు రోజులు రోప్‌కార్ సేవలు రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 22నుంచి ఈ సేవలు యథావిధిగా కొనసాగుతాయి.

32 పశువుల స్వాధీనం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 19: స్థానిక పూందమల్లి సమీపంలోని నజరేత్‌పేటలో ఆంధ్రా నుంచి కేరళకు లారీలో తరలిస్తున్న 32 పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పశువులు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. నజరేత్‌పేట చెక్‌పోస్ట్‌లో వాహన తనిఖీలు నిర్వహించిన పోలీసులు లారీలో పశువులు తరలిస్తున్న కేరళ రాష్ట్రం వయనాడు ప్రాంతానికి చెందిన టోని, అలీఆస్కార్, కర్ణాటకకు చెందిన మోహన్‌కుమార్, ధర్మేష్‌ను అదుపులోకి తీసుకొని, లారీ సహా పశువులు స్వాధీనం చేసుకున్నారు.

23న తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవ క్షేత్రం తిరువణ్ణామలైలో పౌర్ణమి గిరి ప్రదక్షిణ ఈనెల 23 సాయంత్రం 4.22 గంటలకు ప్రారంభమై, 24 సాయంత్రం 6.18 గంటల వరకు ముగుస్తుందని అరుణాచలేశ్వరాలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన జారీ చేశారు. గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని ఆలయంలో భక్తులు సులువుగా దైవదర్శనం చేసుకునేందుకు తగు ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. బ్రేక్ దర్శనం, ప్రత్యేక దర్శనాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా రాష్ట్ర రవాణా సంస్థ ఈ నెల 23, 24 తేదీల్లో తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడుపనుందని తెలిపారు.

600 మంది ఉపాధ్యాయుల అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 19: స్థానిక నుంగంబాక్కంలోని డీపీఐ ప్రాంగణంలో ఆంక్షలు ఉల్లంఘించి ఆందోళన చేసిన 600 మంది ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేశారు. డీపీఐ ప్రాంగణంలో ఆందోళనలు, ధర్నాలకు పోలీసులు అనుమతివ్వడం లేదు. ఈ నేపథ్యంలో తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు ఆందోళనకు దిగడంతో దాదాపు 600 మందిని అరెస్టు చేసి తేనాంపేట, అడయారు, అయనావరం ప్రాంతాల్లోని కమ్యూనిటీ హాళ్లలో ఉంచారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం

వేలూరు, ఫిబ్రవరి 19: ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సోమవారం జరిగింది. నేతాజీ మైదానంలో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలకు జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు, న్యాయమూర్తి మీనాక్షి సుందరం పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థినీ, విద్యార్థులు, ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

భావోద్వేగాల నడుమ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమావేశం

వేళచ్చేరి, ఫిబ్రవరి 19: నగరంలోని 'సవీత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్'కు చెందిన 'సిమట్స్' ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశం భావోద్వేగాలతో, సరదాలు, సందడిగా సాగింది. వివిధ బ్యాచ్‌లకు చెందిన ఔత్సాహిక విద్యార్థులు తమ కళాశాలను మళ్లీ దర్శించుకునేందుకు ఉత్సాహంతో తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తమ అనుభవాలను, తాము సముపార్జించిన జ్ఞానం వివరాలను సహరులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు, ఛాన్సలర్ డాక్టర్ ఎన్.ఎం.వీరయ్యన్ ప్రసంగించారు. స్వచ్ఛంద కార్యక్రమాలు, విద్యార్థుల మార్గదర్శకత్వంలో వారి నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకోవడంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిమట్స్ ప్రో ఛాన్సలర్ డాక్టర్ అశ్వనీకుమార్ తదితరులు కూడా పాల్గొన్నారు.

శవాలను పీక్కుతింటున్న శునకాలు!

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శ్మశానవాటిక సిబ్బంది - మూలకొత్తళంలో ఘోరం

పెరంబూర్, ఫిబ్రవరి 19: స్థానిక మూలకొత్తళం శ్మశానవాటికలో మృతదేహాల చేతులు, కాళ్లు తదితర శరీర భాగాలు బయటపడుతుండంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. శ్మశానవాటికలో సరైన పర్యవేక్షణ లేకపోవడం, మృతదేహాలు పూడ్చేందుకు సిబ్బంది డబ్బులు డిమాండ్ చేయడం, ఇవ్వకపోతే అడుగు లోతులోనే పాతిపెట్టడమే కారణమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మూలకొత్తళంలో 24 ఎకరాల్లో ఉన్న శ్మశానవాటిక 300 ఏళ్ల ప్రాచీనమైనది. మృతులకు డెత్ సర్టిఫికెట్లు ఇచ్చే వారు, అంత్యక్రియలకు గుంతలు తీసేవారు, సహాయకులు కలిపి 30 మందికి పైగా పనిచేస్తున్నారు. భాషోద్యమ వీరులు తాళముత్తు నటరాసన్, తమిళ భాష కోసం నిరంతరం శ్రమించిన డాక్టర్ తరుమాంబాల్, ధనలక్ష్మి, హిందీ వ్యతిరేకపోరాట యోధుడు మయిలై శివముత్తు, సత్యవాణి ముత్తు, తమిళ చరిత్రను రచించిన రాజమాణిక్యనార్ తదితరుల సమాధులు ఇక్కడే ఉన్నాయి. మృతదేహాలను పూడ్చేందుకు ఆరడుగుల మేర గుంత తవ్వాల్సి ఉండగా, కొంతమంది సిబ్బంది 3 అడుగులు మాత్రమే తీసి మృతదేహాలను కప్పెడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక తామడిగినంత ఇవ్వని వారి మృతుల దేహాలను కేవలం రెండడుగుల లోతే కప్పిపెడుతున్నారు. దీంతో, ఆ ప్రాంతంలోని వీధికుక్కలు మృతదేహాల అవయవాలను పీక్కుతింటున్నాయి. ఈ శ్మశానవాటికకు వెళ్లే వారికి పలు ప్రాంతాల్లో శరీర భాగాలు కనిపిస్తుండడంతో భీతిల్లుతున్నారు. అధికారులు స్పందించిన మృతదేహాలను సక్రమంగా పూడ్చిపెట్టడం, డబ్బులు వసూలుచేస్తున్న సిబ్బంది ఆగడాలు అరికట్టడం, శ్మశానవాటికలో మౌలిక వసతులు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

సెల్ఫీ పాయింట్ వద్ద మోదీ బ్యానర్

● వ్యతిరేకిస్తున్న సర్కారు

అడయార్, ఫిబ్రవరి 19: రేషన్‌షాపుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో కటౌట్‌తో సెల్ఫీ పాయింట్‌లను ఏర్పాటు చేయాలన్న భారత ఆహార సంస్థ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తుంది. కేంద్రప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల్లో ప్రధానమంత్రి మోదీ ఫొటో తప్పనిసరిగా ఉంటోంది. అదేవిధంగా రేషన్ దుకాణాల్లో ప్రధాని మోదీ ఫొటోతో 30 తాత్కాలిక సెల్ఫీ పాయింట్లను, 20 పర్మినెంట్ సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయాలని ఎఫ్‌సీఐ నిర్ణయం తీసుకుంది. అయితే, ప్రధాని మోదీ ఫొతో కూడిన కటౌట్‌లతో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తుంది. ఒక్కో తాత్కాలిక సెల్ఫీ పాయింట్ల ఏర్పాటుకు రూ.1.25 లక్షలు, పర్మినెంట్ సెల్ఫీ పాయింట్ల ఏర్పాటుకు రూ.6.25 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. అయితే, మార్చి రెండో వారంలో లోక్‌సభ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఈ సెల్ఫీ పాయింట్లను భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రచారం కోసం ఉపయోగించుకోవాలని భావిస్తుంది. అందుకే ప్రధాని మోదీ ఫొటోతో కూడిన కటౌట్లతో సెల్ఫీ పాయింట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తుంది.

పుదియ నీతి కట్చి ఆధ్వర్యంలో జాబ్ మేళా



అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఏసీ షణ్ముగం

వేలూరు, ఫిబ్రవరి 19: స్థాని ఏసీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అరియూర్‌లో సోమవారం జాబ్ మేళా జరిగింది. ఏసీఎస్ వైద్యకళాశాల స్థాపకుడు, పుదియ నీతి కట్చి అధ్యక్షుడు ఏసీ షణ్ముగం ముఖ్యఅతిథిగా పాల్గొని, శిబిరంలో ఎంపికైన అభ్యర్థులకు నియామాక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించిన జాబ్ మేళాల్లో సుమారు 18,000 మంది ఉద్యోగాలు పొందారన్నారు. ఈ నెల 24న కేవీకుప్పం, మార్చి 2వ తేది వేలూరులో జరుగనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వినూత్న ఆవిష్కరణలపై దృష్టి సారించండి: డాక్టర్ కలైసెల్వి



విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న డాక్టర్ ఎన్.కలైసెల్వి

ప్యారీస్, ఫిబ్రవరి 19: శాస్త్రీయ, సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలకు నాంది పలకాలని సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్ కలైసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక వండలూరులోని బీఎస్ అబ్దుర్ రెహ్మాన్ క్రిసెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 13వ స్నాతకోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో 93 పిహెచ్‌డీ, 599 పీజీ, 1712 యూజీ సహా 2404 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. వీరిలో 53 మంది విద్యార్థులు టాప్‌ర్యాంక్ సాధించి స్వర్ణపతకాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఛాన్సలర్ ఖుర్రాత్ జమీలా, ప్రో ఛాన్సలర్ అబ్దుల్ ఖాదిర్ రెహ్మాన్ బుహారీ, వైస్ ఛాన్సలర్ టీ.మురుగేశన్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్. రాజా హుసేన్, ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎన్.తాజుద్దీన్, మేనేజ్‌మెంట్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెరీనాలో భైరవుడి విగ్రహం లభ్యం



లభ్యమైన విగ్రహం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 19: స్థానిక మెరీనా సముద్ర తీరంలో దివంగత ముఖ్యమంత్రి జయలలిత సమాధి వెనుక వైపున్న భాగంలో ఇసుకలో కూరుకుపోయిన స్థితిలో పంచలోహ విగ్రహం లభ్యమైంది. ఆ మార్గంగా వెళుతున్న కోస్ట్‌గార్డ్ సిబ్బంది విగ్రహాన్ని గుర్తించి వెలికితీశారు. అడుగు ఎత్తున్న కాలభైరవుడి విగ్రహంగా గుర్తించారు. విగ్రహాలు తరలించే ముఠా ఈ విగ్రహాన్ని ఇసుకలో పూడ్చి పెట్టి ఉంటారని పోలీసులు అనుమానిస్తూ, ఆ దిశగా విచారణ చేపట్టారు.

కుశస్థలి నదీ తీరం గట్లు ధ్వంసం



ధ్వంసమైన గట్టు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 19: స్థానిక మనలి పుదునగర్‌లో ఉన్న కుశస్థలి నది తీరం గట్లు ధ్వంసమయ్యాయి. వర్షాకాలంలో పూండి జలాశయం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రవహించే వర్షపునీరు, అదనపు జలాలు ఈ నది మీదుగా మనలి పుదునగర్ దాటి ఎన్నూర్ ముఖద్వారంలో సముద్రంలో కలుస్తాయి. ఈ నేపథ్యంలో, కొత్తనాపాళయం నుంచి ఇడయన్‌చావిడి వరకు సుమారు 2 కి.మీ నది ఇరువైపులా అక్కడక్కడా గట్లు ధ్వంసమై కనిస్తున్నాయి. భారీవర్షాలు కురిస్తే ధ్వంసమైన గట్ల గుండా నీరు విడుదలైన మనలి పుదునగర్ నివాస ప్రాంతాల్లో చేరే ప్రమాదముంది. అధికారులు స్పందించి గట్లు పునరుద్ధరించాల్సి ఉంది.

ఆలందూరులో మందారై బిర్యానీ సెంటర్



మందారై బిర్యానీ సెంటర్ ప్రారంభ దృశ్యం

అడయార్, ఫిబ్రవరి 19: స్థానిక ఆలందూరులో మందారై బిర్యానీ సెంటర్‌ను ఏర్పాటు చేయగా దాన్ని నటుడు, రాజకీయ నేత డి.అజయ్ వాండైయార్, మద్రాస్ హైకోర్టు న్యాయవాది ఎస్.ప్రదీప్, మందారై బిర్యానీ సెంటర్ భాగస్వామి, మిస్ తమిళనాడు 2021 ఎస్.దాచని తదితరులు ప్రారంభించారు. అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందించే మందార ఆకులను ఉపయోగించి ఈ బిర్యానీ తయారు చేయడం ప్రత్యేక అని వారు వెల్లడించారు. స్థానిక ఆలందూరు కోర్టు ఎదురుగా, 100 అడుగుల రోడ్డు, సెంట్ థామస్ మౌంట్ వద్ద ఈ బిర్యానీ సెంటరును ప్రారంభించారు.

కేంద్రం తీరు నిరసిస్తూ కాంగ్రెస్ ధర్నా



ధర్నాలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

వేలూరు, ఫిబ్రవరి 19: కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేసిన బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. స్థానిక పేర్నాంబట్టులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని, కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



వేలూరు జిల్లా ఆంబూరు డీఎస్పీగా సోమవారం బాధ్యతలు చేపట్టిన రామ్మూర్తి

సందడిగా మారిన సెమ్మొళి పార్కు



సెమ్మొళి పార్కులో పర్యాటకులు

పెరంబూర్, ఫిబ్రవరి 19: స్థానిక జెమినీ ఫ్లై ఓవర్ సమీపంలోని సెమ్మొళి పార్కు ప్రజలతో కిటకిటలాడుతోంది. పార్కులో ఈనెల 12వ తేది నుంచి ప్రారంభమైన పుష్ప ప్రదర్శన మంగళవారంతో ముగియనుంది. పర్యాటక ప్రాంతాలైన ఊటీ, కొడైక్కెనాల్, ఏర్కాడు ప్రాంతాల్లో వేసవి సీజన్‌లో పుష్ప ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. నగరంలో తొలిసారిగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సెమ్మొళి పార్కులో ఏర్పాటైన పుష్ప ప్రదర్శనలో సుమారు 12 లక్షలకు పైగా పూల రకాలను ప్రదర్శిస్తున్నారు. ఊటీ, కొడైకెనాల్ తదితర ప్రాంతాల నుంచి పూలు పూసే స్థితిలో ఉన్న మొక్కలను తీసుకురావడంతో, ఇక్కడ అవి పూలు పూసి నగరవాసులను కనువిందు చేస్తున్నాయి. ఆదివారం ఒక్కరోజే సుమారు 30,000 మంది పుష్ప ప్రదర్శనను వీక్షించగా, ఇప్పటివరకు 1.5 లక్షల మంది సందర్శించారని పార్కు అధికారులు తెలిపారు.

పట్టుబడిన మరో హనుమాన్ వానరం



బోనులో చిక్కిన రెండో వానరం

పెరంబూర్, ఫిబ్రవరి 19: స్థానిక వండలూరు జులాజికల్ పార్కు నుంచి తప్పించుకున్న రెండు హనుమాన్ వానరాలు పట్టుబడ్డాయి. జంతువుల మార్పిడి పథకంలో భాగంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్ జైలు నుంచి 10 హనుమాన్ వానరాలు, గద్దలు వండలూరు జూకి దిగుమతయ్యాయి. హనుమాన్ వానరాలను ప్రత్యేక బోను ఉంచి పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో, వాటిలో రెండు తప్పించుకున్నాయి. వాటి కోసం పార్కు సిబ్బంది నగరంలో తీవ్రంగా గాలించారు. ఈ నేపథ్యంలో, సీసీ టీవీ దృశ్యాల ఆధారంగా మన్నివాక్కంలో వానరాలు సంచరిస్తున్నట్లు గుర్తించిన సిబ్బంది, ఆ ప్రాంతంలో బోన్లలో పండ్లు ఉంచి వాటిని బంధించేందుకు యత్నించారు. శనివారం రెండు వానరాలు బోనులో చేరి పండ్లు తింటున్న సమయంలో ఓ వానరానికి మత్తు ఇంజక్షన్ వేయగా, మరొకటి తప్పించుకుంది. ఈ నేపథ్యంలో, ఆదివారం అయ్యంజేరిలో ఏర్పాటుచేసి బోనులోని పండ్లు తినేందుకు వానరం వెళ్లగా తలుపు మూసుకుపోవడంతో అది కూడా పట్టుబడింది. రెండు వానరాలను వండలూరు జూకు తరలించిన సిబ్బంది వాటిని పర్యవేక్షిస్తున్నారు.

బీజేపీ కౌన్సిలర్‌పై కేసు

అడయార్, ఫిబ్రవరి 19: నాగర్‌కోయిల్ లారీ డ్రైవరుపై దాడి చేసి, బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనలో బీజేపీ కౌన్సిలర్‌పై కేసు నమోదు చేశారు. నాగర్‌కోయిల్, వెట్టూరుణిమఠం ప్రాంతానికి చెందిన విమల్‌రాజ్‌కు లారీవుంది. రెండు రోజుల క్రితం లారీ టైరు పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన వేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆ మార్గం మీదుగా నాగర్‌కోయిల్ కార్పొరేషన్ 12వ వార్డు కౌన్సిలర్ సునీల్ అరసు తన స్నేహితుడితో కలిసి వస్తూ, విమల్‌రాజ్‌ను బెదిరించి, ఆయనపై దాడి చేసి రూ.12,800 నగదుతో పాటు ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్సును లాక్కెళ్ళాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు సునీల్ అరసుతోపాటు ఆయన స్నేహితుడిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కారులో చెలరేగిన మంటలు

● ఐదుగురికి తప్పిన ప్రాణాపాయం

అడయార్, ఫిబ్రవరి 19: కోయంబత్తూరు నుంచి సేలం వెళ్తున్న కారు నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ప్రయాణికులు వెంటనే కారు దిగి ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం మేరకు... కోవై, పెరియార్ నగర్‌కు చెందిన కమలేష్ (20) తన నలుగురు కుటుంబ సభ్యులతో కారులో సేలంకు బయలుదేరాడు. ఈ కారు కోవై - సేలం జాతీయ రహదారిలో పల్లంగౌండం పాళెయం వద్ద వెళ్తుండగా కారు నుంచి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన కమలేష్ కారును రహదారి పక్కన నిలిపివేసి, అందులోని వారందరూ కారు నుంచి దిగేశారు. ఊత్తుకులి పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

మంటల్లో దగ్ధమైన మూడు మరపడవలు

అడయార్, ఫిబ్రవరి 19: కన్నియాకుమారి జిల్లా నిత్తిరవిలైలో ఆదివారం అర్ధరాత్రి మూడు మరపడవలు మంటల్లో దగ్ధమైపోయాయి. పాతకక్షల కారణంగానే గుర్తు తెలియని వ్యక్తులు ఈ మరబోట్లకు నిప్పు అంటించివుంటారని స్థానికులు భావిస్తున్నారు. అర్ధరాత్రి ఈ ఘటన జరగడంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. ఈ ప్రమాదంపై స్థానికులు అగ్నిమాపకదళ సిబ్బందికి సమాచారం అందించగా, అగమేఘాలపై అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

12 ఇంజనీరింగ్ కాలేజీల మూసివేతకు అన్నావర్శిటీ నిర్ణయం

అడయార్, ఫిబ్రవరి 19: విద్యార్థుల చేరిక తక్కువ గా ఉన్న కారణంగా 12 ఇంజనీరింగ్ కాలేజీలను మూసివేయాలని అన్నా విశ్వవిద్యాలయం నిర్ణయించిం ది. రాష్ట్రవ్యాప్తంగా అన్నా వర్శిటీకి దాదాపు 500కు పైగా ఇంజనీరింగ్ అనుబంధ కాలేజీలున్నాయి. ఈ అనుబంధ కాలేజీల్లో యేటా అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోతోంది. ఇలాంటి కాలేజీల్లోని విభాగాల్లో ఒక్కో శాఖను మూసివేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల చేరికలు తక్కువగా ఉన్న 12 ఇంజనీరింగ్ కాలేజీలను మూసివేయాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఉన్న ఈ కాలేజీల్లో గత నాలుగేళ్ళుగా కనీసం 5 శాతం సీట్లు కూడా భర్తీ కాలేదు. దీంతో ప్రస్తుతం ఈ కాలేజీల్లో చదవుఉతున్న విద్యార్థులను ఇతర కాలేజీల్లో చేర్పించి ఆ కాలేజీలు శాశ్వతంగా మూసివేయాలని భావిస్తున్నారు. ఇదే విషయంపై అన్నా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆర్.వేల్‌రాజ్ మాట్లాడుతూ... పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఈ కాలేజీల్లో అడ్మిషన్ల సంఖ్య పెరగలేదు. అతి తక్కువ మంది విద్యార్థులతో నడుస్తున్న కాలేజీలను కచ్చితంగా మూసివేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

విషజ్వరంతో బాలిక మృతి



విద్యార్థిని (ఫైల్ ఫొటో)

వేలూరు, ఫిబ్రవరి 19: స్థానిక వాణియంబాడి సమీపంలో విషజ్వరంతో బాలిక మృతి చెందింది. తిరుపత్తూర్ జిల్లా కాకాపట్టుకి చెందిన 6వ తరగతి విద్యార్థిని కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు వాణియంబాడి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. జ్వరం తగ్గకపోవడంతో ఆమెను కృష్ణగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక సోమవారం ఉదయం మృతిచెందింది.

వైభవంగా సుబ్రమణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

వేలూరు, ఫిబ్రవరి 19: స్థానిక బేరిపేట శివసుబ్రమణ్యస్వామి ఆలయ 34వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఉత్సవ ఉభయదారు, తమిళనాడు విశ్వకర్మ స్నేహితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తేజోమూర్తి, ఉపాధ్యక్షుడు పన్నీర్‌సెల్వం తదితరుల పర్యవేక్షణలో జరిగాయి. వేడుకల్లో పారంపర్య ట్రస్టీ దొరైస్వామి, మార్గబంధు, సత్యనారాయణన్, విశ్వకర్మ స్నేహితుల సంక్షేమ సంఘం సెక్రటరీ జనార్థనన్, ప్రధాన కేంద్ర సెక్రటరీ సోమసుందరం, కార్యకర్తల కమిటీ సభ్యులు సుకరీశ్వరన్, పంచాక్షరం, షణ్ముగ ఆచారి, మూర్తి, నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం వృషభ వాహనంలో ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకరణలో వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు షణ్ముగ గురుకల్, ఉమాహ గురుకల్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు సంచుల వినియోగంపై అవగాహన



పసుపు సంచులు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఫిబ్రవరి 19: ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వులతో పసుపు సంచులపై అవగాహన కల్పించే కార్యక్రమం వేలూరు జిల్లాలో ప్రారంభమైంది. వేలూరు నగరంలోని కో- ఆపరేటివ్ రేషన్ దుకాణంలో ఊటీ టీ పౌడర్ 100 గ్రాములు కొనుగోలు చేసిన వారికి రూ.20 విలువైన పసుపు సంచిని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కో-ఆపరేటివ్ సంఘాల జాయింట్ రిజిస్ట్రార్ తిరుగుణ అయ్యప్పదొరై, ఊటీ టీ పౌడర్ సంస్థ జనరల్ మేనేజర్ శంకరనారాయణన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సుమతి తదితరులు పాల్గొన్నారు.



తంగర్ బచ్చాన్ తనయుడు హీరోగా కొత్త చిత్రం

ప్రముఖ సినిమాటోగ్రాఫర్, దర్శకుడు తంగర్ బచ్చాన్ తనయుడు విజిత్ బచ్చాన్ హీరోగా 'పేరన్నుమ్ పెరుంకోబముమ్' అనే టైటిల్‌తో ఓ కొత్త చిత్రం తెరకెక్కుతుంది. ఇందులో హీరోయిన్‌గా షాలి నివేకాస్ నటించారు. ప్రముఖ దర్శకుడు బాలు మహేంద్ర ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన శివప్రకాష్ దర్శకుడు. ఇతర పాత్రల్లో షైమ్ గోపి, అరుల్ దాస్, లోగు, సుభద్ర, దీపా, సాయివినోద్ తదితరులు నటించారు. జేపీ ప్రకాష్ ఛాయాగ్రహణం అందించగా, 'ఇసై జ్ఞాని' ఇళయరాజా సంగీత స్వరాలు సమకూర్చారు. రియోటా మీడియా సంస్థ నిర్మించింది. ఈ సినిమా గురించి దర్శకుడు శివప్రకాష్ వివరిస్తూ.. 'హీరో జీవితంలో మూడు విభిన్న కాలాల్లో జరిగే సంఘటనల సమాహారంగా ఈ సినిమా స్క్రీన్‌ప్లే సాగుతుంది. సమాజంలో జరిగే దుర్మార్గాలను హీరో ఎలా ఎదుర్కొన్నాడు? వంటి రసవత్తరమైన అంశాలు, ఆసక్తికరమైన మలుపులతో స్క్రీన్‌ప్లే రూపొందించా. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని చివరిదశ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి' అని పేర్కొన్నారు. కాగా, సోమవారం టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశాం. ఇందులో హీరో, హీరోయిన్లను ఈ నేల ప్రేమికుల రోజును ప్రతిబింబించేలా డిజైన్ చేశారు.

'క్వీన్ ఎలిజబెత్'గా మీరా జాస్మిన్

● జీ5లో స్ట్రీమింగ్

మీరా జాస్మిన్ ప్రధాన పాత్రలో నటించిన 'క్వీన్ ఎలిజబెత్' జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. పూర్తిస్థాయి వినోదాత్మకంగా రూపొందిన ఈ చిత్రానికి ఎం.పద్మకుమార్ దర్శకత్వం వహించారు. ఇతర పాత్రలను నరేన్, శ్వేతా మేనన్, వీకే ప్రకాష్ తదితరులు పోషించారు. నిజానికి ఈ చిత్రం గత యేడాది మలయాళంలో ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదల చేశారు. ఇప్పుడు తమిళంలోకి అనువాదం చేసి, మలయాళంతో పాటు తమిళంలోనూ విడుదల చేశారు. ఈ సినిమా ద్వారా మీరా జాస్మిన్ - నరేన్ కాంబినేషన్ 15 యేళ్ల తర్వాత మళ్లీ కనిపించి, ప్రేక్షకులను అలరిస్తోంది. పెళ్లికాని మధ్యవయస్కురాలైన మీరా జాస్మిన్... తన చుట్టూ ఉన్న వారితో అసహ్యించబడిన వ్యక్తిగా, సాంగత్యం అవసరం లేని వ్యక్తిగా జీవిస్తుంటుంది. ఆమె ప్రేమను గెలుచుకోవడానికి నరేన్ పడే పాట్లు, వ్యాపారరీత్యా కోయంబత్తూరుకు వెళ్లే మీరా జాస్మిన్.. తన ప్రయాణం ఎలా ముగుస్తుంది? పెళ్లికాని మధ్య వయస్కురాలైన మహిళ జీవితాన్ని, ప్రేమను వెతకడానికి ఆమె చేసిన ప్రయాణాన్ని అద్భుతమైన కామెడీ టచ్‌తో దర్శకుడు పద్మకుమార్ తెరకెక్కించారు.


'క్వీన్ ఎలిజబెత్'లో మీరా జాస్మిన్, నరేన్

చిత్రజ్యోతి

విజయ్ ఓకే అంటే 'లియో-2'

● లోకేష్ కనకరాజ్


విజయ్ - లోకేష్ కనకరాజ్

యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ 'లియో' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను డైరెక్ట్ చేయనున్నారు. తలైవర్ 171కు లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహించనున్నారు. అయితే, 'లియో'కు సీక్వెల్ వస్తుందంటూ జరుగుతున్న ప్రచారంపై ఆయన స్పందించారు. 'లియో-2'పై అంచనాలు భారీగానే ఉన్నాయి. అయితే, హీరో విజయ్ అంగీకరిస్తేనే ఇది కార్యరూపం దాలుస్తుంది. అయితే, విజయ్ భవిష్యత్తు ప్రణాళికలు చాలా ఉన్నతంగా ఉన్నాయి. అందువల్ల 'లియో-2' గురించి ఇపుడు ఏం చెప్పలేను' పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం లోకేష్ కనకరాజ్ 'తలైవర్ 171' ప్రీపొడక్షన్ పనుల్లో నిమగ్నమైవున్నారు. ఈ సినిమా ఏప్రిల్‌లో సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. ఈ స్క్రిప్టు రైటింగ్ పనుల్లో లోకేష్ బిజీగా ఉన్నారు.

నటుడు ఎస్వీ శేఖర్‌కు నెలరోజుల జైలు శిక్ష



పెరంబూర్, ఫిబ్రవరి 19: నటుడు ఎస్వీ శేఖర్‌కు నెలరోజుల జైలు శిక్ష విధిస్తూ చెన్నై ప్రత్యేక న్యాయస్థానం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2018లో మహిళా పాత్రికేయురాలిపై ఫేస్‌బుక్‌లో అసభ్య వార్తలు పోస్ట్ చేశారనే కేసులో ఎస్వీ శేఖర్‌కు నెల రోజుల జైలు, రూ.15,000 జరిమానా విధిస్తూ చెన్నై ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. 'నేరారోపణలు ఎలాంటి అనుమానాలకు తావులేకుండా నిరూపితమయ్యాయి' అన్న న్యాయమూర్తి జి.జయవేలు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, మద్రాసు హైకోర్టులో అప్పీలు చేసుకుంటున్నట్లు తెలిపిన ఎస్వీ శేఖర్, జరిమానాను సత్వరం చెల్లించడం గమనార్హం.

కమలం వలలో విజయధరణి చిక్కరు

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు


ముఖ్యమంత్రితో సెల్వపెరుంతగై

అడయార్, ఫిబ్రవరి 19: భారతీయ జనతా పార్టీ నేతల వలలో కాంగ్రెస్ సీనియర్ మహిళా నేత విజయధరణి చిక్కరని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై అన్నారు. పార్టీలో సీనియర్ మహిళా నేతగాను, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న విజయధరణి త్వరలోనే బీజేపీలో చేరబోతున్నట్టు గత కొన్ని రోజులుగా జోరుగా సాగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన సందర్భంగా సోమవారం ఉదయం అసెంబ్లీలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న సెల్వపెరుంతగై విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పక్షపాతం వహిస్తోందని ఆరోపించారు. మేం చెల్లించే పన్నులను తిరిగి మాకు చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. తమిళనాడు రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటాను ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ఇస్తున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌ను నమూనాగా తీసుకుని రాష్ట్ర బడ్జెట్ తయారు చేశారంటూ బీజేపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. తమ పార్టీ మహిళ నేత విజయధరణి బీజేపీ నేతల వలలో చిక్కరని తాను భావిస్తున్నట్టు వ్యాఖ్యానించారు.

రేపు టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా సెల్వపెరుంతగై బాధ్యతల స్వీకరణ

పెరంబూర్: తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడుగా సెల్వ పెరుందగై బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు స్థానిక రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో మాజీ టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి నుంచి సెల్వపెరుంతగై నూతన టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి డాక్టర్ అజయ్‌కుమార్, ఏఐసీసీ కార్యదర్శి సిరివెల్ల ప్రసాద్, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత ఎస్.రాజేష్‌కుమార్, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం, ఎంపీలు చెల్లకుమార్, మాణిక్యం ఠాగూర్, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షులు తంగబాలు, ఈవీకేఎస్ ఇళంగోవన్, ఎమ్మెల్యే తిరునావుక్కరస్సు, సీనియర్ నేత కుమరి అనంతన్, జిల్లా అధ్యక్షుడు, సీనియర్ నేతలు పాల్గొంటారని టీఎన్‌సీసీ తెలియజేసింది.

ఫార్ములా-4 కారు పందేల నిర్వహణకు అనుమతి



పెరంబూర్, ఫిబ్రవరి 19: ఫార్ములా-4 కారు పందేలు నిబంధనలతో నిర్వహించేలా మద్రాసు హైకోర్టు అనుమతులు జారీ చేసింది. ఫార్ములా రేసింగ్ సర్క్యూట్ ఇండియా ఆధ్వర్యంలో తొలి స్ట్రీట్ సర్క్యూట్ పందేలకు సంబంధించి 'ఫార్ములా-4 ఇండియన్ ఛాంపియన్‌షిప్', 'ఇండియన్ రేసింగ్ లీగ్' పోటీలు చెన్నైలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ పోటీలు స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్ చుట్టు పక్కలున్న 3.5 కి.మీ దూరం మేరకు రాత్రి వేళల్లో నిర్వహించనున్నారు. ఈ పోటీలను నిషేధించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. కారు రేస్ పోటీల సమయంలో ఏర్పడే పెద్ద శబ్దాల కారణంగా ఓమందూర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలోని రోగులకు ఇబ్బందులు కలుగుతాయని, రక్షణ, హార్బర్, కోస్ట్‌గార్డ్ పనులకు కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశముందని పేర్కొన్నారు. ఇరుంగాట్టుకోటలో అంతర్జాతీయస్థాయి రన్‌వే ఉన్న నేపథ్యంలో, చెన్నై కార్పొరేషన్ పరిధిలో పోటీలు నిర్వహించరాదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే, ఈ పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.40 కోట్లు ఖర్చు చేస్తోందని, దీంతో ఎలాంటి ఆదాయం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇంతలో, 'మిచౌంగ్' తుఫాను కారణంగా ఫార్ములా-4 కారు రేస్ పోటీలు వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో, ఈ పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు, రేస్ జరిగే సమయంలో కలిగే శబ్దకాలుష్యానికి ఓమందూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించింది. అలాగే, రాష్ట్రప్రభుత్వం అందజేసిన రూ.42 కోట్లు తిరిగి జమ చేయాలని, ప్రైవేటు సంస్థే పోటీలకయ్యే ఖర్చులు భరించాలని హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది.

1న చెన్నైలో డీఎంకే భారీ బహిరంగ సభ

పెరంబూర్, ఫిబ్రవరి 19: డీఎంకే ఆధ్వర్యంలో చెన్నైలో మార్చి 1వ తేది భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జన్మదినం, పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించనున్న ఈ బహిరంగ సభకు 'ఇండియా' కూటమిలోని పార్టీ నేతలను ఆహ్వానిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు.

కేంద్రం నుంచి సబ్సిడీలు తగ్గుముఖం

● ఆర్థిక శాఖ కార్యదర్శి ఉదయచంద్రన్


చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం చెల్లించే సబ్సిడీలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో కేంద్రం ఆర్థికపరంగా ఆదుకోకపోవడంతో ఆర్థిక పరిస్థితి కుంటుపడుతోందని ఆర్థిక శాఖ కార్యదర్శి ఉదయచంద్రన్ తెలిపారు. శాసనసభ సమావేశం ముగిసిన తర్వాత ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా లేదని, ఉన్న వనరులతోనే నెట్టుకు రాగలుగుతున్నామని, ప్రస్తుతం సంక్షేమ పథకాలకు నిధుల కొరత ఏర్పడకుండా జాగ్రత్తలు పాటిస్తున్నామన్నారు. దేశంలోనే మహిళాభ్యుదయానికి అధికనిధులు కేటాయిస్తున్నామని, కాంక్రీటు ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగిస్తాయన్నారు.

గవర్నర్ ఢిల్లీ పయనం

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి సోమవారం ఉదయం ఢిల్లీకి బయలుదేరివెళ్లారు. నాలుగు రోజులపాటు ఆయన ఢిల్లీలో బస చేయనున్నారు. సోమవారం ఉదయం 6గంటలకు మీనంబాక్కం విమానాశ్రయం నుంచి ఆయన విమానంలో ఢిల్లీకి పయనమయ్యారు. మంగళవారం ఢిల్లీలో నేషనల్ సెక్యూరిటీ స్కూలులో ఏర్పాటయ్యే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఆ తర్వాత ఆయన వీలును బట్టి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలుసుకోనున్నారు. ఇటీవల శాసనసభలో తన ప్రసంగానికి ముందు, చివర జాతీయ గీతం వినిపించాలని చేసిన విజ్ఞప్తిని పాలకులు పట్టించుకోలేదని సభలోనే ఆరోపించి సంచలనం కలిగించిన గవర్నర్ రవి ఆ విషయాన్ని కూడా అమిత్‌షా దృష్టికి తీసుకెళతారని తెలుస్తోంది.

ఎన్నికల పొత్తుపై రెండు రోజుల్లో నిర్ణయం

● కమలహాసన్ ప్రకటన



చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఏ కూటమితో పొత్తు కుదుర్చుకోవాలనే విషయమై రెండు రోజుల్లో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని మక్కళ్ నీదిమయ్యం అధ్యక్షుడు కమలహాసన్ తెలిపారు. అమెరికా పర్యటనను ముగించుకుని ఆయన సోమవారం ఉదయం చెన్నైకి తిరిగొచ్చారు. విమానాశ్రయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'థగ్‌లైఫ్' సినిమా షూటింగ్ ముందస్తు ఏర్పాట్లు చేపట్టేందుకే అమెరికాకు వెళ్లానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రెండు రోజుల్లో పొత్తుకు సంబంధించిన గుడ్‌న్యూస్ చెబుతానని ఆయన తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు తమ పార్టీ ఎప్పుడో సిద్ధమైందని, జిల్లా శాఖ నాయకులంతా ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉన్నారని చెప్పారు. తమ పార్టీ ఏడో వార్షిక ఉత్సవాలు ఈ నెల 21న ఆళ్వార్‌పేటలోని పార్టీ కార్యాలయం జరగనున్నాయని ఆయన చెప్పారు. ఈ వేడుకల్లో పార్టీ ప్రముఖులు, జిల్లా నేతలు అందరూ పాల్గొంటారని చెప్పారు.

వీఐటీ వర్శిటీలో ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం


పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తున్న వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్

వేలూరు, ఫిబ్రవరి 19: స్థానిక వీఐటీ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వండ్రన్‌తాంగళ్‌లో ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. ఏడు రోజులు జరుగనున్న ఈ శిబిరాన్ని వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ పాలనలో రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం ఉన్నత విద్యలో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. విద్యారంగానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అధిక నిధులు కేటాయించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య అందించేలా చర్యలు చేపట్టాలని విశ్వనాథన్ కోరారు. కార్యక్రమంలో భాగంగా వండ్రన్‌తాంగళ్ పంచాయతీ యూనియన్ మాధ్యమిక పాఠశాలకు కంప్యూటర్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వీఐటీ వర్శిటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, సెల్వం తదితరులు పాల్గొన్నారు. వైద్యశిబిరం, మహిళా స్వయం సహాయక బృందాలకు శిక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛభారత్ తదితరాలు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చేపడతారని నిర్వాహకులు తెలిపారు.

2 కోట్ల మందికి పార్టీ సభ్యత్వం

● టీవీకే జిల్లా నేతల సభ నిర్ణయం


జిల్లా నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న బుస్సీ ఆనంద్

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా శాఖ నేతలందరూ పార్టీ సభ్యత్వ ముమ్మర కార్యక్రమాలపై దృష్టి సారించాలని ప్రముఖ తమిళ సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రిక్కళగం (టీవీకే) ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ పిలుపునిచ్చారు. ఆ పార్టీ జిల్లా శాఖ నేతల సమావేశం పనయూరులోని పార్టీ ప్రధాన కార్యాలయం భవనంలో సోమవారం ఉదయం జరిగింది. ఈ సమావేశంలో తొలుత జిల్లా నేతలు, పార్టీ శ్రేణుల చేత అందరికీ సమాన హక్కుల కోసం, సమాన అవకాశాలు కల్పించడం కోసం అహరం పాటుపడతామంటూ ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగ ధర్మాసనానికి కట్టుబడి ఉంటామని, కులమతాలకు అతీతంగా ప్రజలందరి బాగు కోసం పాటుపడతామని బుస్సీ ఆనంద్ అందరి చేత శపథం చేయించారు. ఆ తర్వాత పార్టీ అధిష్ఠానం పరిశీలనలో ఉన్న నాలుగు రకాలైన పథకాల్లో దేన్ని ఎంపిక చేయాలన్న విషయంపై జిల్లా శాఖ నేతలు చర్చలు జరిపారు. అదే సమయంలో పార్టీ అధ్యక్షుడు విజయ్ వెలువరించిన ప్రకటన మేరకు పార్టీలో సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టాలని బుస్సీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. రెండు కోట్ల మందిని పార్టీ సభ్యత్వం కల్పించాలని పార్టీ నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. అదే సమయంలో ఓటర్ల జాబితా సవరణ పనులపై కూడా పార్టీ శ్రేణులు దృష్టిసారించాలని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు వెలువరించిన ప్రకటన అంశాలను కూడా ఆయన చదివి వినిపించారు.


మెరీనా తీరం సమీపంలోని రాజధాని కళాశాలలో తమిళ పితామహుడు స్వామినాథ అయ్యర్ 170వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలు చల్లి నివాళి అర్పిస్తున్న మంత్రులు స్వామినాథన్, ఎం.సుబ్రమణ్యం, గీతా జీవన్, మేయర్ ప్రియ తదితరులు



చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయ సమీపంలో సోమవారం తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న సిబ్బంది చేపట్టిన ధర్నా


ఉప్పు మళ్లలో కార్మికులు

వేదారణ్యంలో మళ్లీ ఉప్పు ఉత్పత్తి ప్రారంభం

ప్యారీస్, ఫిబ్రవరి 19: ఈశాన్య రుతుపవనాల కారణంగా గత మూడు నెలలుగా స్తంభించిన ఉప్పు ఉత్పత్తి మళ్లీ నాగపట్టణం జిల్లా వేదారణ్యంలో ప్రారంభమైంది. జిల్లాలోని సముద్రతీర ప్రాంతాలైన అగస్త్రియన్‌పల్లి, కాడినల్‌వయల్, కొడియకాడు, వేదారణ్యం ప్రాంతాల్లో సుమారు 9 వేల ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రంలో తూత్తుకుడి తర్వాత వేదారణ్యంలో ఉత్పత్తి అవుతున్న ఉప్పును రాష్ట్రంలోని పలు జిల్లాలకే కాకుండా విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. సుమారు 7 వేల మందికి పైగా కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న ఉప్పు ఉత్పత్తి పనులు మూడు నెలల అనంతరం మళ్లీ ప్రారంభం కావడంతో ఈఏడాది 7 లక్షల టన్నుల ఉప్పు ఉత్పత్తి అయ్యే అవకాశముందని ఉప్పు మళ్ల యజమానులు ఆశాభావం వ్యక్తం చేశారు.


సోమవారం శాసనసభ సమావేశాలకు హాజరై వెలుపలికి వస్తున్న పీఎంకే శాసనసభ్యుడు జీకే మణి తదితరులు